## క్లుప్తంగా

### వాహనాల తనిఖీ



దండేపల్లి: తనిఖీ చేస్తున్న పోలీసులు

**దండేపల్లి:** నాఖా బందీలో భాగంగా దండేపల్లి మండలం గూడెం అటవీ చెక్‌పోస్టు వద్ద లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై కుందారపు ప్రసాద్‌ తమ సిబ్బందితో కలిసి శనివారం వాహనాలు తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహన తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. అన్ని రకాల వాహనాలను తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**జన్నారం:** మండలంలోని తపాలపూర్‌, కలమడుగు, ఇందన్‌పల్లి గ్రామాల్లోని అటవీ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు నాఖా బందీ నిర్వహించారు. లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి, జన్నారం ఎస్సై సతీశ్‌ ఆధ్వర్యంలో వచ్చి, పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించారు. రామగుండం కమిషనర్‌ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గంజాయి తరలింపు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుండా తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు.

### పేకాటరాయుళ్లపై కేసు

**దండేపల్లి:** మండలంలోని లింగాపూర్‌ శ్మశాన వాటిక సమీపంలో శనివారం పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.10,510 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కుందారపు ప్రసాద్‌ తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### 13న విద్యాసంస్థల బంద్‌

**మంచిర్యాలఅర్బన్‌:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 13న విద్యాసంస్థల బంద్‌ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్‌, తిరుపతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందించాలని, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు.

### విరాళాలు సేకరించి.. వైద్యఖర్చులకు అందించి

**దండేపల్లి:** మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళ, ఎండీ మాలన్‌ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో, వైద్య ఖర్చుల కోసం స్థానికులు సోషల్‌ మీడియా ద్వారా దాతల నుంచి సాయాన్ని కోరారు. స్పందించిన దాతలు తమకు తోచిన సాయాన్ని అందించగా మొత్తం రూ.2లక్షలు జమయ్యాయి. వాటిని శనివారం ఆమె చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తాళ్లపేట ఉపసర్పంచ్‌ పుట్టపాక తిరుపతి, తదితరులు ఉన్నారు.

### చెత్త వాహనాలు అడ్డగింత

**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని అండాళమ్మకాలనీ వాసులు శనివారం మున్సిపల్‌ చెత్తవాహనాలను డంప్‌యార్డుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కాలనీ సమీపంలో ఉన్న తాత్కాలిక డంప్‌యార్డులో చెత్తను కాల్చడం వల్ల దుర్గంధం వెదజల్లి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రెండు నెలల క్రితం తాత్కాలిక డంప్‌యార్డును ఇక్కడి నుంచి తరలించాలని మున్సిపల్‌ అధికారులకు విన్నవించగా, రెండు నెలల్లో తరలిస్తామని మాట ఇచ్చినప్పటికీ చెత్తను ఇక్కడే పడేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే డంపుయార్డును వేరే చోటుకు తరలించాలని కోరారు.

### శివ కల్యాణం



దామోదర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీ పరిధిలోని బాబుక్యాంపు బస్తీలో ఆర్యవైశ్యకల్యాణ మండపంలో శనివారం రెండోరోజు రాజశ్యామల యాగాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఆర్యవైశ్య శ్రేణులు ఎంతో నిష్ఠతో యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు, హోమం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో యాగం వైభవంగా జరిగింది. రాత్రి శివకల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. పోలీస్‌ హౌజింగ్‌ కార్పొరేషన్‌ రాష్ట్ర చైర్మన్‌ కోలేటి దామోదర్‌ ముఖ్య అతిథిగా హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భజన సంఘం తరపున దామోదర్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సీనియర్‌ నాయకులు పున్నంచందు, భాస్కర్‌, వాసవీ భజన బృందం అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్‌, అంజయ్య, కోశాధికారి నందయ్య ఇతర శ్రేణులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్‌ జయంతి

- నివాళులర్పించిన పలు పార్టీల నాయకులు



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

**పాతమంచిర్యాల/మందమర్రిరూరల్‌/బెల్లంపల్లి/జన్నారం/జైపూర్‌:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతిని జిల్లా వ్యాప్తంగా పలు పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్‌ వైఎస్సార్‌ అంటూ నినాదాలు చేశారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చీట్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్‌ అధ్యక్షుడు తూముల నరేష్‌, కౌన్సిలర్లు బానేష్‌, సుజాత పాల్గొన్నారు. సీఎంగా వైఎస్సార్‌ ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలను, చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు.

- మందమర్రిలో వైఎస్సార్‌టీపీ, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు వేరువేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్‌ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జిల్లా యూత్‌ అధ్యక్షుడు అజీమొద్దీన్‌, ప్రభుదేవ, రాజేంద్రప్రసాద్‌, శ్రీనివాస్‌, జావేద్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సుదర్శన్‌, పాష, హఫీజ్‌, వీరస్వామి, శంకర్‌ ఉన్నారు.
- బెల్లంపల్లి పట్టణంలో కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్‌ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైఎస్సార్‌ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్‌, పట్టణ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్‌, కాంగ్రెస్‌ అనుబంధ సంఘాల నాయకులు మల్లయ్య, ఆకాష్‌, రాజలింగు తదితరులు పాల్గొన్నారు. బెల్లంపల్లి చెందిన పలువురు కాంగ్రెస్‌ నాయకులు హైదరాబాద్‌ వెళ్లగా, అక్కడ వైఎస్సార్‌ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్‌, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు నాతరి స్వామి, రొడ్డ శారద, గెల్లి జయరాం, వేముల కృష్ణ, ఎండీ అఫ్జల్‌, మాజీ కౌన్సిలర్‌ సతీష్‌, సిలివేరు సత్యనారాయణ, గౌస్‌ పాల్గొన్నారు.
- జన్నారంలోని పైడిపెల్లి గార్డెన్‌లో కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముజాఫర్‌ అలీఖాన్‌, సయ్యద్‌ ఇసాక్‌, కంటెం శంకర్‌, లక్ష్మీనారాయణ, నందునాయక్‌, అజార్‌, మహేశ్‌, వసీంపటేల్‌, శిరిష్‌, నగేశ్‌, సాగర్‌గౌడ్‌, మంద రాజేశ్‌, శ్రీనివాస్‌, రాజ్‌కుమార్‌, రియాసత్‌అలీ, హేమంతచారి, ముజ్జు, తిరుపతి పాల్గొన్నారు.
- జైపూర్‌ మండలంలోని పెగడపల్లిలో వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు షేక్‌ అజీమొద్దీన్‌, దళిత విభాగం జిల్లా అధ్యక్షుడు మల్కల్ల రాజేంద్రప్రసాద్‌, జైపూర్‌ మండల అధ్యక్షుడు తుంగపిండి సాయి, యువజన విభాగం జిల్లా నాయకులు చరణ్‌, మహిళా విభాగం నాయకురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.



జైపూర్‌: పెగడపల్లి వద్ద నివాళులు



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



మందమర్రిరూరల్‌: వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో..



జన్నారం: నివాళులర్పిస్తున్న నాయకులు

# అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

**శ్రీరాంపూర్‌:** నస్పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో రూ.46లక్షలు, నాలుగో వార్డులో రూ.21లక్షల డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణం పనులు చేపట్టగా శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరై భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్‌లో వాడవాడలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు నేడు అభివృద్ధిలో ముందున్నాయన్నారు. వాడవాడలా సిమెంట్‌ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించినట్లు తెలిపారు. కొన్ని చోట్ల మిగిలి ఉన్న పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నస్పూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ ఈసంపల్లి ప్రభాకర్‌, వైస్‌ చైర్మన్‌ తోట శీను, కౌన్సిలర్లు పంబాల గంగా ఎర్రన్న, బడికే లక్ష్మి, పూదరి కుమార్‌, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, పట్టణ కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు సంతోష్‌ చారి, మహిళా కార్యదర్శి జ్యోతి, టీబీజీకేఎస్‌ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వినతి**

- అభివృద్ధి పనుల కోసం కృష్ణాకాలనీకి వచ్చిన సందర్భంగా పలువురు నిరుద్యోగులు శ్రీరాంపూర్‌ ఏరియాలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దివాకర్‌రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నిరుద్యోగులు శ్రీపెల్లి రాజు, కట్ల శ్రీనివాస్‌, దుర్గం రఘుకుమార్‌, విజయరాజు, మౌనిక, వంశీకృష్ణ పాల్గొన్నారు.

# వాకింగ్‌ట్రాక్‌పై పూలమొక్కలు నాటి నిరసన



పూలమొక్కలు నాటుతున్న అసోసియేషన్‌ సభ్యులు

**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని రామునిచెరువు వాకింగ్‌ ట్రాక్‌ చిన్నపాటి వర్షానికే బురదగా మారుతుందని వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు వాపోతున్నారు. వాకింగ్‌ ట్రాక్‌ అభివృద్ధి పేరుతో మున్సిపల్‌ అధికారులు చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. సంవత్సర కాలంగా చేస్తున్న ట్రాక్‌ అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో 300మంది వాకర్స్‌ ట్రాక్‌పై నడవలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. బురదమయమైన ట్రాక్‌ను నడకకు అనువుగా చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్‌ అలసత్వానికి నిరసనగా బురదమయంగా మారిన వాకింగ్‌ట్రాక్‌పై పూల మొక్కలు నాటి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత కార్మికసంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు రాజేందర్‌ రెడ్డి, సత్యనారాయణమూర్తి, రాంరెడ్డి జనార్దన్‌, తుల రాజయ్య, శ్రీనివాసరెడ్డి, లచ్చన్న, రంగారావు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

**పాతమంచిర్యాల:** మోదీ ప్రభుత్వం రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చీట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు కొండా చంద్రశేఖర్‌ అన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రధానిమోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్‌, మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలు పెంట రజిత, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేష్‌, సింగిల్‌విండో డైరెక్టర్‌ తూముల వెంకటేష్‌, డీసీసీ డెలిగేట్‌ సంజీవ్‌, టౌన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్‌ చేయాలి



సమ్మెలో పాల్గొన్న గ్రామపంచాయతీ సిబ్బంది

**కోటపల్లి:** గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్‌, మల్టీపర్పస్‌ వర్కర్ల సమస్యలు పరిష్కరించి, తమను పర్మినెంట్‌ చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను చేపట్టారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని, తమను పర్మినెంట్‌ చేసి వేతనాలు పెంచాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజన్న, ఉపాధ్యక్షుడు మహేశ్‌, ప్రధాన కార్యదర్శి సుందర్‌, సంతోశ్‌, కోశాధికారి సంపత్‌, సభ్యులు లక్ష్మణ్‌, ఆనంద్‌, మధుకర్‌, సునీల్‌, యాదగిరి పాల్గొన్నారు.

**జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**దండేపల్లి:** జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జీపీ ఎంప్లాయిస్‌, వర్కర్‌ యూనియన్‌(సీఐటీయూ)జేఏసీ కో-కన్వీనర్‌ పాలడుగు సుధాకర్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సమీపంలో రిలే దీక్షలో కూర్చున్న జీపీ కార్మికులకు శనివారం సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్‌ యూనియన్‌(సీఐటీయూ)జిల్లా అధ్యక్షుడు దాసరి సురేష్‌, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగుల శ్రీధర్‌, రాజలింగు, నాయకులు బానేష్‌, సాయికృష్ణ, డిన్ను, శంకర్‌, సాగర్‌, లక్ష్మి పాల్గొన్నారు.

**మంచిర్యాలరూరల్‌ (హాజీపూర్‌):** తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. సమ్మెకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్‌, జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్‌, డీహెచ్‌పీఎస్‌ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, కార్మిక నాయకుడు జైపాల్‌ సింగ్‌ మద్దతు పలికారు.

# ఫారెస్టు కార్యాలయం ఎదుట ఆదివాసీల ధర్నా



ధర్నా చేస్తున్న ఆదివాసీలు

**కోటపల్లి:** మండలంలోని కొండంపేటలో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు పట్టాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్‌ చేస్తూ కోటపల్లి ఫారెస్టు రేంజ్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌సీ కమిటీ చైర్మన్‌ నైతం మహేశ్‌ మాట్లాడుతూ.. పట్టాలిచ్చి తమకు న్యాయం చేయాలని శాంతియుతంగా దీక్ష చేస్తుంటే, ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని, నిరసన కార్యక్రమాలు అడ్డుకుంటున్నారన్నారు. ప్రభుత్వ విప్‌ బాల్కసుమన్‌ స్పందించి వెంటనే ఆదివాసీలకు పట్టాలు మంజూరయ్యేలాగా చూడాలని డిమాండ్‌ చేశారు. ఎన్నో ఏళ్లగా సాగు చేసుకుంటున్న తమకు న్యాయం జరిగేంత వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేశ్‌, సంతోశ్‌, సందీప్‌, సాయిచరణ్‌, శ్రావణ్‌, సమ్మన్న, బుచ్చక్క, సారక్క, లక్ష్మీ, మధునక్క పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీ కార్యక్రమాలపై సమీక్ష

**మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌):** స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీ ఎస్‌ టీఏ, ఎఫ్‌ఏలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో సామాజిక తనిఖీ కార్యక్రమాల గురించి సమీక్షించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఈజీఎస్‌ పనులు, బడ్జెట్‌పై సామాజిక తనిఖీ జరపాలని ఎంపీడీవో అబ్దుల్‌ హై సూచించారు. డీఆర్‌పీలకు కార్యదర్శులు, ఈజీఎస్‌ సిబ్బంది సహకరించాలన్నారు.

# 'నా భద్రత- నా బాధ్యత'

- రక్షణపై అవగాహన కల్పించిన అధికారులు



కాసిపేట గనిపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

**శ్రీరాంపూర్‌:** నా భద్రత-నా బాధ్యత, నా భద్రత-నా కుటుంబ భద్రత.. అనే నినాదంతో ఉద్యోగులు పనిచేయాలని శ్రీరాంపూర్‌ ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు తెలిపారు. ఆర్కే న్యూటెక్‌ గనిపై శనివారం ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించారు. ఉద్యోగులందరూ తమ వ్యక్తిగత భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సేఫ్టీ మేనేజ్మెంట్‌ ప్లాన్‌, సేఫ్‌ ఆపరేటింగ్‌ ప్రొసీజర్‌ ప్రకారం విధులు నిర్వర్తిస్తే గనుల్లో ప్రమాదాలు తగ్గుతాయన్నారు. రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టే రమేష్‌, సంక్షేమాధికారి పాల్‌ సృజన్‌, పిట్‌ ఇంజనీర్‌ రాజగోపాలచారి, ఇంజనీర్‌ కృష్ణ, వెంటిలేషన్‌ అధికారి శంకర్‌, సర్వే అధికారి విచ్చేశ్వరరావు, టీబీజీకేఎస్‌ పిట్‌ సెక్రెటరీ జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్‌:** మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో శనివారం కార్మికులకు రక్షణపై అవగాహన కల్పించారు. జీఎం సేఫ్టీ గుప్తా మాట్లాడుతూ రక్షణ సూత్రాలను ప్రతీ ఉద్యోగి తప్పక పాటించాలన్నారు. రక్షణ అనేది మొదటిగా ఇంటి వద్ద నుంచే ప్రారంభం కావాలని పనిస్థలాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం నాగరాజు, డీజీఎం బాలాజీ భగవతి, సేఫ్టీ ఈఅండ్‌ఎం రామనాథం, డీవైఎస్‌ఈ చంద్రమౌళి, పిట్‌ కార్యదర్శి సంజీవ్‌ తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట:** ప్రతి కార్మికుడు 'నా రక్షణ-నా భాధ్యత' నుంచి 'నా రక్షణ- నా కుటుంబ బాధ్యత'గా ముందుకు సాగాలని మందమర్రి ఏరియా ఇంజనీర్‌ నాగరాజు, ఏరియా రక్షణాధికారి రవీందర్‌ సూచించారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శనివారం రక్షణపై అవగహన కల్పించారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్‌ ప్లాన్‌(ఎస్‌ఎంపీ), ఆపరేటింగ్‌ ప్రొసీజర్‌పై అవగాహన, రక్షణకు అధిక ప్రాధాన్యం, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో గని మేనేజర్‌ అల్లావుద్దీన్‌, రక్షణాధికారి సునీల్‌కుమార్‌, టీబీజీకేఎస్‌, ఏఐటీయూసీ పిట్‌ కార్యదర్శులు భైరి శంకర్‌, మినుగు లక్ష్మినారాయణ, డెప్యూటీ మేనేజర్లు నిఖిల్‌, వెంకటేష్‌, వంశీకృష్ణ, ఇంజనీర్లు బాబు, మధుకర్‌, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన



**రామకృష్ణాపూర్‌:** దేశ ప్రధాని నరేంద్రమోదీ వరంగల్‌ పర్యటనను వ్యతిరేకిస్తూ మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ గ్రూప్‌ గనులు, డిపార్ట్‌మెంట్లపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులు నిరసన తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం, ఇప్పటికైనా తన విధానాలను మార్చుకోవాలని డిమాండ్‌ చేశారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ, ఇప్పకాయల లింగయ్య, వినయ్‌, సంజీవ్‌, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గుబాయి వార్తలు

### సమాన ప్రాతినిధ్యం కల్పించాలి

**శ్రీరాంపూర్‌:** అన్ని జాతీయ కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు కోరారు. జాతీయ సంఘాల నాయకులు శనివారం ఎస్‌ఆర్పీ 3, 3ఏ గని మేనేజర్‌ సంతోష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగేంత వరకు జాతీయ సంఘాల నేతలను కార్మిక సమస్యలపై చర్చించడానికి పిలువాలన్నారు. మైన్స్‌, సేఫ్టీ కమిటీల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఆర్‌ఎల్సీ వద్ద కంపెనీ డైరెక్టర్‌ బలరాం ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలు జరిగేంత వరకు సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోదారి భాగ్యరాజ్‌, వెంగళ శ్రీనివాస్‌, చీకట్ల సాగర్‌, ఏఐటీయూసీ నాయకులు కావటం మల్లేష్‌, అంబాల రవి, శ్రీకాంత్‌, ఐఎన్టీయూసీకి చెందిన మనోజ్‌ తదితరులు పాల్గొన్నారు.

### శిక్షకులు కావలెను

**మందమర్రిరూరల్‌:** మందమర్రి ఏరియాలోని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్‌, ఫ్యాషన్‌ డిజైనింగ్‌, మగ్గం వర్క్‌, బ్యూటిషియన్‌ కోర్సులు నేర్పించడానికి శిక్షకులు కావాలని ఏరియా పర్సనల్‌ మేనేజర్‌ సల్ల శ్యాం సుందర్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో అనుభవం ఉండి నేర్పించుటకు ఆసక్తి గలవారు ఈ నెల 15లోగా అర్హత గల ధ్రువ పత్రాలతో జీఎం ఆఫీస్‌లోని పర్సనల్‌ విభాగం 9666135136, 9703279797 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### చర్యలు తీసుకోవాలి

**మందమర్రిరూరల్‌:** ఏరియాలోని ప్రాణహిత కాలనీ(షిర్కే)లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్‌ వర్కర్ల సూపర్‌వైజర్‌ తిరుపతి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు జాఫర్‌, కాంట్రాక్ట్‌ కార్మికులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**గడపగడపకూ బీఆర్‌ఎస్‌**

**మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌):** హాజీపూర్‌ మండల కేంద్రంలో శనివారం గడపగడప కూ బీఆర్‌ఎస్‌ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌, జీవన్‌రావు, విజిత్‌రావు, పార్టీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మోదీ సభకు కమలనాథులు**

**బెల్లంపల్లి:** వరంగల్‌ జిల్లా కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న బహిరంగసభకు బెల్లంపల్లి నుంచి బీజేపీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో బయలు దేరివెళ్లారు.

**నూతన పేరెంట్స్‌ కమిటీ ఎన్నిక**

**చెన్నూర్‌:** చెన్నూర్‌ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల పేరెంట్స్‌ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రచార కార్యదర్శి తగరం అశోక్‌ తెలిపారు. అధ్యక్షుడిగా ఓరం మల్లేశ్‌, ప్రధాన కార్యదర్శిగా భీమిని రాజన్న, ఉపాధ్యక్షులుగా మొగిలి, తిరుపతి, సహాయ కార్యదర్శులుగా సురేశ్‌గౌడ్‌, పెండ్యాల శ్రీకాంత్‌, ప్రచార కార్యదర్శిగా ఆత్కూరి మధు, మహిళా కార్యదర్శిగా రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా జ్యోతి, సంధ్యను నియమించినట్లు తెలిపారు.

**అన్నదానం**

**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో శనివారం మంచిర్యాల లయన్స్‌క్లబ్‌ సభ్యులు తేజప్రసాద్‌ ఆధ్వర్యంలో హంగర్‌రిలీఫ్‌ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వైద్యంకోసం వచ్చిన 300మందికి అన్నదానం చేశారు.


**గడపగడపకూ కాంగ్రెస్‌ పాదయాత్ర**

**చెన్నూర్‌రూరల్‌:** మండలంలోని సుబ్బరాంపల్లి, కత్తెరసాల, రాయిపేట, నారాయణపూర్‌ గ్రామాల్లో శనివారం కాంగ్రెస్‌ పార్టీ చెన్నూర్‌ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేశ్‌ ఆధ్వర్యంలో పాదయాత్రను చేపట్టారు. గ్రామాల్లో గడపగడపకూ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**'పనిచేసే కార్యకర్తకు గుర్తింపు'**

**జన్నారం:** పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు వస్తుందని టీపీసీసీ ఎస్టీ సెల్‌ ఉపాధ్యక్షుడు భరత్‌ చౌహాన్‌ అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌ జయంతిలో పాల్గొని మాట్లాడారు. పదవుల విషయంలో న్యాయం జరిగేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ నెల 12న ఏఐసీసీ ఇన్‌చార్జి మానిక్‌రావు ఠాక్రేను కలిసి ఇక్కడి సమస్యలు వివరించి, పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

### జలమయంగా జాతీయ రహదారి..!



**భీమారం:** మండలం సమీపంలోని జోడువాగుల వద్ద మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారిలో వర్షాల కారణంగా నీరు నిలిచి అధ్వానంగా మారింది. అటవీశాఖ అనుమతుల పేరుతో రోడ్డుని వెడల్పు చేయకుండా, అలాగే వదిలేశారని పలువురు ఆరోపిస్తున్నారు. గుంతలతో ప్రమాదాలకు గురవుతున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. కొత్తగా రోడ్డు నిర్మించే లోపు, ఉన్న రోడ్డును రెండు వరసల రోడ్డుగా నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**గుంతల పూడ్చివేత**

**మందమర్రిరూరల్‌:** ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని పలుచోట్ల గుంతలు ఏర్పడి నీళ్ల నిలిచాయి. మార్కెట్‌ వ్యాపార కమిటీ అధ్య క్షుడు విజయ్‌కుమార్‌ కమిషనర్‌ రాజుతో మాట్లాడి శనివారం మొరంపోయించి గుంతలు పూడ్చి వేయించారు.